

తమిళనాడులోని పళని తరహాలో రోప్ వే ఏర్పాటుకు సన్నాహాలు

ఖిల్లాను సందర్శించిన పురావస్తు, పర్యాటక శాఖ అధికారులు

ప్రణాళిక రూపకల్పనపై మంత్రి తుమ్మల సమీక్ష

నెల రోజుల్లోగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు

వెలుగుమట్ల అర్బన్ ఫారెస్ట్ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచన

ఖమ్మం ఖిల్లాకు పర్యాటక కళ

ఖమ్మం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాకతీయుల కాలం నాటి చారిత్రక ఖమ్మం ఖిల్లాకు పూర్వవైభవం రానుంది. ఈ ఖిల్లా పర్యాటక కేంద్రంగా మారాలనే ఖమ్మం వాసుల కల నెరవేరబోతోంది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా ఖమ్మం ఖిల్లాను నిలిపేందుకు మంత్రి తుమ్మల చర్యలు ప్రారంభించారు. ఖిల్లాను చూసేందుకు వచ్చే పర్యాటకులకు మౌళిక సదుపాయాలతో పాటు తమిళనాడు పళని తరహాలో రోప్‌వే నిర్మాణం చేపట్టేందుకు కార్యచరణ సిద్ధమవుతోంది. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ, ఆ శాఖ ఈఈలు రామకృష్ణ, శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి, పర్యాటకశాఖ అధికారుల బృందం బుధవారం ఖిల్లాను సందర్శించింది. కాకతీయుల కాలంలో శత్రు సైన్యాల దాడిని ఎదుర్కొనేందుకు నిధి, నిక్షేపాలు దాచేందుకు పటిష్టమైన పది ద్వారాల దుర్గంగా నాలుగు చదరపు మైళ్ల వైశాల్యంలో ఈ ఖిల్లా నిర్మించారు. ఆ తర్వాత అనేక మది రాజులు, నిజాం ప్రభువులు ఈ ఖిల్లాను కేంద్రంగా చేసుకుని పాలన సాగించారు. ఖమ్మం ఖిల్లాను సందర్శించిన అధికారులతో బుధవారం మంత్రి తుమ్మల ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఖిల్లా చరిత్ర, కాకతీయుల కాలం నాటి నిర్మాణాలు, జాఫర్‌బావితో పాటు ఇతర నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఖమ్మం ఖిల్లా ఒకటిగా ఉండేలా నెలరోజుల్లోగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తమిళనాడులోని పళని వద్ద ఏర్పాటు చేసినట్లు ఇక్కడ రోప్‌వే ఏర్పాటు చేయాలని, ఇందుకు తమిళనాడు అధికారులను కూడా సంప్రదించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.


పురావస్తు, పర్యాటక శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష


ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఖిల్లా గత వైభవం తెలిపేలా చరిత్ర వివరాలు, పర్యాటకులకు అవసరమైన ఫుడ్‌కోర్టు, ఇతర సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. ఖిల్లాను ఎక్కేందుకు మెట్లమార్గం అభివృద్ధి చేయాలని, తాగునీరు, సేద తీరేందుకు షెడ్ల నిర్మాణం, రాత్రివేళ లైటింగ్, పార్కింగ్ సదుపాయాలతో పక్కా ప్రణాళిక సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోని పోర్టుల్లో ఉన్న సౌకర్యాలను కూడా తెలుసుకుని సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

అలాగే ఖమ్మం సమీపంలోని వెలుగుమట్ల అర్బన్ ఫారెస్టు పార్కును కూడా ప్రజలు తిలకించేలా సౌకర్యాలు సమకూర్చాలని, సుమారు 500 ఎకరాల్లో ఈ పార్కు ఏర్పాటు చేశామని, అటవీ, పర్యాటక తదితర శాఖల అధికారులు సంయుక్తంగా అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. నెలరోజుల్లోగా ఖమ్మం ఖిల్లాతో పాటు వెలుగుమట్ల ఫారెస్టు పార్కు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లాకు ఎంతో చరిత్ర ఉందని, దీన్ని అభివృద్ధి చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా చేయడమే తన లక్ష్యమని తెలిపారు ఈ ప్రక్రియలో భాగంగా పురాతన నిర్మాణాలకు ఎక్కడా నష్టం కలగకుండా ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు పురావస్తు, పర్యాటకశాఖ అధికారులను పరిశీలించాలని ఆదేశించామని తెలిపారు.

నెల రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసిన అనంతరం నిధులు కేటాయించి పనులు చేయిస్తామన్నారు. తమిళనాడులోని పళని ప్రాంతం కూడా ఖమ్మం ఖిల్లా వలే ఉంటుందని, అక్కడ ఏర్పాటు చేసిన రోప్‌వే పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

రహదారి, పార్కింగ్..

ఖమ్మం ఖిల్లాపై ఉదయం నుంచి రాత్రి వరకు పర్యాటకులు సందర్శించేలా రహదారి మార్గం, పార్కింగ్ సదుపాయాలు, సులభంగా ఖిల్లా ఎక్కేలా రోప్‌వేమార్గం తదితర సదుపాయాలు ఏర్పాటుచేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. దీంతోపాటు 500ఎకరాల్లో నిర్మించిన వెలుగుమట్ల అర్బన్ ఫారెస్టు పార్కును కూడా అభివృద్ధి చేస్తామన్నారు. అడవిని చూసిన అనుభూతి కలిగేలా అక్కడ అటవీ వృక్షాలు, అటవీ మొక్కలు, పూలమొక్కలను పెంచుతామన్నారు. ఫుడ్‌పార్కు, ప్రజలు సేదతీరేందుకు అవసరమైన హట్స్ నిర్మిస్తామని తుమ్మల తెలిపారు.



- సబ్‌స్క్రిప్షన్ల పేరుతో నయా మోసం
- టాస్క్‌ల పేరుతో టోకరా
- సోషల్‌మీడియా వేదికగా కేటుగాళ్ల ట్రాప్
- ప్రతీనెలా రూ.కోట్లల్లోనే దోపిడీ
- అత్యాశకు పోయి నష్టపోతున్న జనం

7

ఇంట్లో ఖాళీగా ఉండి వర్క్‌ఫ్రమ్ హోమ్, పార్ట్‌టైమ్ వంటి జాబ్‌ల కోసం ఇంటర్‌నెట్‌లో వెతుకుతున్నారా ? అయితే తస్మాత్ జాగ్రత్త! ఇష్టారీతిన గుర్తుతెలియని వెబ్‌సైట్‌లలో లాగిన్ అయ్యారో.. ఇక అంతే సంగతులు. సైబర్‌నేరగాళ్లు వెంటనే సమాచారాన్ని సేకరించి మీపై వల విసురుతారు. కొన్ని రోజులక్రితం వరకు కంప్యూటర్, ఫోన్లను హ్యాకింగ్, ఫిషింగ్ ఎటాక్‌లకు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడ్డ సైబర్ కేటుగాళ్లు వాటిపై ప్రజల్లో అవగాహన పెరగడంతో కొత్త పంథాను ఎంచుకున్నారు. తెలిసి మరీ మోసపోయేలా నేరాలకు పాల్పడుతున్నారు. కొద్ది నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నమోదవుతున్న సైబర్ నేరాల కేసులను పరిశీలిస్తే వాటిల్లో అత్యధికంగా పార్ట్‌టైమ్ టాస్క్‌లకు సంబంధించిన మోసాలే అధికంగా ఉంటున్నాయి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం

గత రెండేళ్లలో సైబర్ నేరాలు ఇలా...

వివరాలు(సంవత్సరం)	2022	2023
ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్	05	03
ఆన్‌లైన్ ఫ్రాడ్	930	1,098
సోషల్ మీడియా	143	129
క్రిప్టో కరెన్సీ	7	2
వచ్చిన ఫిర్యాదులు	1,249	1,332
ఎఫ్ఐఆర్‌లు అయినవి	203	280
పోగొట్టుకున్న నగదు	రూ.4.51 కోట్లు	రూ. 9.07 కోట్లు
రికవరీ అయినవి	రూ.5.28లక్షలు	రూ.16.96లక్షలు

'సుబ్లేడ్' టీచర్ సస్పెన్షన్

- విద్యార్థులను చితకబాదిన ఘటనలో అధికారుల చర్య
- తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 21: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం సుబ్లేడ్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న గిరిజన బాలుర పాఠశాలలో విద్యార్థులను చితకబాదిన తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణరావుపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే అతడిపై తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్లకింద కేసు నమోదైంది. సుబ్లేడ్ గిరిజన గురుకుల పాఠశాలలో లక్ష్మణరావు అనే తెలుగు ఉపాధ్యాయుడు... మార్కులు తక్కువ వస్తున్నాయని 15మంది పదో తరగతి విద్యార్థులను చితకబాదగా దెబ్బలకు తాళలేక సదరు విద్యార్థులు ఆ ఉపాధ్యాయుడిపై తిరగబడిన విషయం తెలిసిందే.

కాగా ఈ ఘటనకు సంబంధించిన ఉపాధ్యాయుడు లక్ష్మణరావుపై తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థులను నిర్బంధించి కొట్టినందుకుగాను అతడిపై కేసు నమోదుతో పాటు గురుకుల అధికారులు కూడా అతడిపై చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్‌సీవో టి.వెంకటేశ్వరరాజు అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మంగళవారం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు అకారణంగా దాడికి పాల్పడ్డాడనే విషయం తేలడంతో అతడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.


ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణలో మాట్లాడుతున్న సీపీ సునిల్‌దత్

పోలీసులకు జవాబుదారీతనం ముఖ్యం

- పోలీసు కమిషనర్ సునిల్‌దత్

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 21: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుళ్ల 9నెలల శిక్షణలో భాగంగా బుధవారం రామగుండం, వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల నుండి 193 మంది సివిల్ పోలీసు కానిస్టేబుళ్లు ఖమ్మం సిటీ పోలీసు శిక్షణ కేంద్రానికి చేరుకున్నారు. వీరికి శిక్షణను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ధరించే యూనిఫామ్.. సమాజం పట్ల జవాబుదారీతనం పెంచుతుందని, శిక్షణ అనంతరం రోజువారీ సవాళ్లను ఎదుర్కొంటూ విధినిర్వహణ చేయాల్సి ఉంటుందని సీపీ అన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగంలో క్రమశిక్షణ చాలా ముఖ్యమనే విషయం గుర్తుంచుకోవాలని, శిక్షణ కాలంలో ఇండోర్, అవుట్‌డోర్ అంశాలను క్రమపద్ధతిలో నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు గణేష్, ప్రసన్నకుమార్, ఏవో అక్తరున్నీసా బేగం, ఆర్‌ఐలు తిరుపతి, కామరాజు, శ్రీశైలం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వనదేవతలకు వందనాలు..

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూడా పలుచోట్ల మినీ జాతరలు బుధవారం ప్రారంభమయ్యాయి. గిరిజన సంప్రదాయాల ప్రకారం ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు సమర్పించారు. బుధవారం సారలమ్మ గద్దెపైకి చేరగా, గురువారం సమ్మక్క రానుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు తదితర ప్రాంతాల్లో జాతర సందడి నెలకొంది. అలాగే ఖమ్మంలోని ధంసలాపురం వద్ద మంత్రి తుమ్మల వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.



సెలవులో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21: జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఐదు రోజుల పాటు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవుపై వెళ్లినట్లు సమాచారం. బుధవారం నుంచి ఆదివారం వరకు సెలవు పెట్టారు. ఇన్‌చార్జి బాధ్యతలను అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్‌కు అప్పగించారు. కలెక్టర్ గౌతమ్ ఆదివారం రాత్రి ఖమ్మం చేరుకుని సోమవారం విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

'కట్ట'లో కలిసింది..

- భద్రాద్రి కరకట్ట నిర్మాణంలో కలిసిపోతున్న పల్లె ప్రకృతి వనం

7

అపురూపం.. ప్రతిబింబం...

- ఆశ్చర్యపరిచే ఒకేరకమైన పోలికలు, అలవాట్లు
- నేడు కవలల దినోత్సవం

- వేసవి వేళ ఆర్‌డబ్ల్యూఎస్ అప్రమత్తం
- జిల్లాలో 178 గ్రామాలు సమస్యాత్మకమైనవిగా గుర్తింపు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రూ.4.83 కోట్లతో ప్రణాళికలు
- అవసరమైతే బోర్లు, వ్యవసాయ బావులను అద్దెకు తీసుకునేందుకు సిద్ధం



తాగునీటి ఎద్దడిపై యుద్ధం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21: వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటుతున్న దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. తాగునీటి సమస్యలను గుర్తించే పనిలో అధికారి నుంచి ఏఈ స్థాయి వరకు గ్రామాల బాట పట్టారు. సమస్యలు గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తాగునీటి ఎద్దడి నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నియోజకవర్గానికి రూ.కోటి నిధులు మంజూరు చేయడంతో అధికారులు సమస్యలను గుర్తించే పనిలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలోని 20 మండలాలకు 178 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు రూ 4.80 కోట్ల నిధులు అవసరం పడతాయని ప్రాథమిక అంచనాకు వచ్చారు. మంత్రు లు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు గ్రామాల్లో పర్యటిస్తూ మోటార్లు, బోర్లు పరిస్థితిని పరీక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. అవసరమైతే బోర్లు, వ్యవసాయ బావులను కూడా అద్దెకు తీసుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 11 గ్రామాల్లో లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, ఇతర శాఖల అభివృద్ధి పనులకు పైప్‌లైన్లు ధ్వంసం కావడం లాంటి కారణాలతో నీటి సరఫరా కావడంలేదని గుర్తించారు. దీనికి తోడు ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతుండడంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. దీంతో 178 గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి వచ్చే ఆస్కారం ఉందని అంచనాలు సిద్ధం చేశారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో 14 గ్రామాలు, తిరుమలాయపాలెం మండలంలో 17 గ్రామాలు, నేలకొండపల్లి మండలంలో 5, ఖమ్మం రూరల్ మండలంలో 9 గ్రామాలు మొత్తంగా 45 గ్రామాల్లో కనీసం కోటి రూపాయలు అవసరం ఉంటుందని అంచనాలు సిద్ధం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో రఘునాథపాలెం మండలంలో 25 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణ కోసం రూ. 84 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. వైరా నియోజకవర్గంలో వైరాలో 5, ఏన్కూరు మండలంలో 6, కొణిజర్ల మండలంలో 10, సింగరేణి మండలంలో 5 మండలాల్లో 83 లక్షలతో, కామేపల్లి మండలంలో 11 గ్రామాల్లో 20లక్షలతో అంచనాలు తయారు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లిలో 7, పెనుబల్లిలో 10, తల్లాడలో 6, వేంసూరులో 6, కల్లూరులో 8 గ్రామాల్లో మంచినీటి సమస్య రాబోతోందని అంచనా వేశారు. వీటి కోసం కోటి రూపాయలు ప్రతిపాదించారు. మధిర నియోజకవర్గంలో మధిరలో 7, బోనకల్‌లో 7, ఎర్రుపాలెంలో 7, ముదిగొండలో 7, చింతకాని మండలంలో 6 గ్రామాల్లో మంచినీటి సమస్య నివారణ కోసం రూ 96.30లక్షలు అంచనాలు సిద్ధం చేశారు.

గ్రామాల్లో సర్వే చేస్తున్నాం...



పుష్పలత, ఈఈ మిషన్ భగీరథ

తాగునీటి ట్యాంకులు ప్రధాన పైపులైన్ల పరిస్థితితో పాటు పంపులు, ఎలా పనిచేస్తున్నాయి, లీకేజీలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పరిశీలిస్తున్నాం. బోర్లు వాటి పరిస్థితి, వాటికి ట్యాంకులకు అనుసంధానంగా ఉన్న పైపు లైన్లు ఎలా ఉన్నాయనేది పరిశీలిస్తున్నాం. అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) తో అంచనాలు సిద్ధం చేస్తున్నాం. మార్చి నాటికి ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం



సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభం జనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్లు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జన మైంది.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



చదువుతోనే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21: చదువుతోనే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునని హ్యూమన్ ఇంజనీర్ నరసింహ రాజు కేసీ పెద్ది అన్నారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎడ్యూకేషన్, ఎంప్లాయిబులిటీ, ఎఫీసియన్సి ఎంపతి, ఎథిక్స్ (5ఈ) అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడి ఉషారాణి, రజిత, ప్రిన్సిపల్ ఝున్సీరాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 21: మండలంలోని బుర్రవేముల గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు పట్టుబడగా, మరికొందరు అక్కడి నుంచి పారిపోయారు. సంఘటనా స్థలం నుంచి రూ.4వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ బొడ్డు అశోక్‌కుమార్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో...

● ముగ్గురి రిమాండ్

నేలకొండపల్లి, ఫిబ్రవరి21: మండల పరిధిలోని బోదులబండలో ఆదివారం రాత్రి అనుమానాస్పద రీతిలో ఉరి వేసుకుని మృతి చెందిన పొట్టపింజర మనోహరి అలియాస్ పూరి కేసులో నేలకొండపల్లి పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతురాలి భర్త విజయకుమార్, మామ వెంకట్రామయ్య అలియాస్ బొందయ్య, అత్త ఉషలను బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తోట నాగరాజు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 21: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటన బుధవారం మండలంలోని మీనవోలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన తిరువూరు డిపో బస్సు విజయవాడ నుంచి తిరువూరు వెళ్లే రోడ్డు మార్గంలో మీనవోలు గ్రామం వద్ద అడ్డుగా వచ్చిన గెదెలను తప్పించే క్రమంలో ఆపగా ఎదురుగా అతివేగంతో వచ్చిన లారీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ శేఖర్ గాయపడ్డాడు. బస్సు డ్రైవరును అంబులెన్స్‌లో బనిగండ్లపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కండక్టర్ విజయదుర్గ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లిపారు.

కొత్తూరులో రూ.70వేలు చోరీ..

నేలకొండపల్లి, ఫిబ్రవరి21: మండల పరిధిలోని మంద్రాజుపల్లి కొత్తూరులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వజ్జా రామారావు మంగళవారం ఇంటికి తాళం వేసి పక్కింట్లో ఇచ్చి ఖమ్మం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా తలుపులకున్న గడి తీసి ఉంది. చెరుకు నరకగా వచ్చిన రూ.70వేలు చోరీకి గురైనట్లు గ్రహించి బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్నద్ధత సమయం..
ప్రణాళికే కీలకం...



ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 21: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి.. విద్యార్థులు ఒత్తిడి, భయం లేకుండా ప్రణాళికతో సన్నద్ధమైతే లక్ష్యాలను చేరుకోవడం కష్టమేమీ కాదు. ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఆత్మవిశ్వాసమే ఇంధనం

విద్యార్థుల సానుకూల దృక్పథంతో సన్నద్ధమవ్వాలి. ఎంత కఠిన అంశమైనా సాధిస్తాననే నమ్మకంతో చదవాలి. ఎట్టి పరిస్థితిలో వెనుకబడ్డామని భావించవద్దు. ప్రతి సబ్జెక్టుకు కచ్చితమైన ప్రణాళిక రూపొందించుకొని సాధన చేయాలి. సమయ ప్రణాళికను పేపర్‌పై రాసుకొని గోడకు అంటించుకోవాలి. ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు చదవడం ద్వారా విషయం చాలా కాలం గుర్తుండిపోతుంది.

అంతర్లీన ప్రతిభను వెలికితీయాలి

తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవద్దు. వారిలో ఆత్మవిశ్వాసం నింపాలి. తోటి విద్యార్థులతో పోల్చకూడదు. పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసేందుకు భరోసానివ్వాలి. ఇక తరగతి గదిలో ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి. పాఠ్యాంశాల్లో సందేహాలు నివృత్తి చేస్తూ, చదివేలా ప్రోత్సహించాలి.

బృంద చర్చలతో సత్ఫలితాలు

ఆయా సబ్జెక్టుల్లో కఠినమైన వ్యాసరూపంలో ఉండే జవాబులను చిన్న చిన్న అంశాలుగా విభజించుకోవడం మేలు. పాఠ్యాంశాలను బట్టీ పట్టకుండా అర్థం చేసుకొని సాధన చేస్తే కఠినమైన పదాలు, పాఠాలు గుర్తుంటాయి. ఆంగ్లం, గణితం, భౌతిక రసాయనశాస్త్రం సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని పునఃశ్చరణ చేసుకోవాలి. తరగతి గదిలో విద్యార్థుల బృంద చర్చలు మంచి ఫలితమిస్తాయి.

తల్లిదండ్రులదీ బాధ్యత

పాఠశాల నుంచి ఇంటికి రాగానే పిల్లలు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. పరీక్షల సమయంలో ఇది మరింత ప్రమాదకరం. టీవీలకు అతుక్కుపోయి, సామాజిక మాధ్యమాల మోజులో పడి చదివింది మరచిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లల ముందు తాము కూడా ఫోన్, టీవీ చూడటం మానేయాలి.

పోషకాహారంతో చురుకుదనం

విద్యార్థులు జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఈ సమయంలో విద్యార్థులు పోషకాహారం తీసుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఉదయం, సాయంత్రం పాలు, కోడిగుడ్డు ఇవ్వాలి. పండ్లు, డ్రైఫ్రూట్స్ ద్వారా తక్షణ శక్తి లభిస్తుంది.

సూర్యాపేట-దేవరపల్లి హైవేకు ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలి

● ధంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద గ్రామస్థుల ధర్నా



పనులను అడ్డుకుంటున్న ధంసలాపురం గ్రామస్థులు

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి21: సూర్యా పేట-దేవరపల్లి హైవేకు ధంస లాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని కోరుతూ వందలాది మంది ప్రజలు బుధవారం ధంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని ధంసలాపురం పక్క నుంచే సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్తున్నా, ఆ రహదారిపై ప్రయాణించే అవకాశం లేదన్నారు. ఖమ్మంతో పాటు చింత కాని, బోనకల్, ముదిగొండ మండలాలకు చెందిన హైదరాబాద్‌కు, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి వెళ్లాలన్నా, అటు నుంచి వచ్చేటప్పుడు దిగాల న్నా ఎంట్రీ, ఎగ్జిట్ లేకపోవడంతో ఇబ్బందులు పడా ల్సి వస్తుందని పేర్కొన్నారు. ధర్నాలో పిన్నెల్లి శ్రీనివాస రావు, వాకా సీతారామిరెడ్డి, కురుగుంట్ల నర్సింహారెడ్డి, శెట్టి మోహన్‌రావు, సురే ష్, పోతురాజు ఉపేందర్, గుడిపాటి నర్సింహారావు, గంటి హుస్సేన్, గుండ్లపల్లి శేషు, మందడపు ప్రభాకరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సత్యాల మధు, నెమలి కిషోర్, ప్రసాద్‌రెడ్డి, పలు మండలాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

కిష్టారంలో సోలార్ స్తంభాలు తొలగింపు

● మీ నిధులు వద్దు.. సీహెచ్‌పీని తరలించండంటూ ఆందోళన

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21: సింగరేణిలోని బొగ్గును తరలించే సీహెచ్‌పీని తరలించాలంటూ కిష్టారం గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి వచ్చిన కిష్టారం ఓసీ పీవో నరసింహారావును గ్రామంలోని అంబేడ్కర్ నగర్ వాసులు అడ్డుకున్నారు. సింగరేణి నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ స్తంభాలను తొలగించి పీవో వాహనానికి అడ్డుగా వేసి నిరసన వ్యక్తం చేశారు. తాము గ్రామంలోనే ఉంటామని, సమీపంలోని సీహెచ్‌పీని వెంటనే తరలించి తమ ప్రాణాలను కాపాడాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అందేవిధంగా గ్రామానికి నిధులు ఏమీ వద్దని, తమ ప్రాణాలను పొగొట్టే సింగరేణి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని భీష్మించుకూర్చున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పీఓ వారికి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యయత్నం

కామేపల్లి, ఫిబ్రవరి 21: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యయత్నం చేసుకున్న సంఘటన గోవింద్రాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన దర్గీ కటుంబ కలహాలతో ఇంట్లో ఉన్న ఎలుకలమందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైన్‌షాపు సీజ్

వైరా, ఫిబ్రవరి 21: వైరాలోని మధిర రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న శ్రీనివాస శబరివైన్స్‌ను ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగ ళవారం రాత్రి సీజ్ చేశారు. వైరాలోని ఓ బెల్టుషాపులో మద్యం విక్రయాలను అధికారులు తనిఖీ చేసిన సమయం లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తుండటంతో పట్టుకున్నారు. బెల్టుషాపు నిర్వాహకుడు ఇచ్చిన వాంగ్మూలం మేరకు వైన్‌షాపును సీజ్ చేశారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీల పట్టివేత

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 7 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు మండలంలోని అయ్యవారిగూడెం వద్ద బుధవారం పట్టుకున్నారు. అయ్యవారిగూడెం గ్రామంలో గల ఇసుకరేవు నుంచి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో ఇసుకను డంపుచేసి రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకొని, 7 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. వారివద్ద ఎటువంటి కూపన్లు కానీ, ప్రభుత్వ వేబిల్లులు లేకపోవడంతో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు.

తల్లాడ: ఆంధ్రప్రదేశ్ నుంచి ఖమ్మం పరిసర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను తల్లాడ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తల్లాడలోని రింగ్‌రోడ్డు సెంటర్లో ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో పోలీస్‌లు వాహనాలు తనిఖీలు చేస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఏడాది జైలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 21: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరానికి చెందిన నిందితుడు జంగం వెంకటేశ్వర్లుకు ఏడాది జైలుశిక్షతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.4.86 లక్షలు చెల్లించాలని మద్యపాన ఆబ్కారీ ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత బుధవారం తీర్పు చెప్పారు. 2017లో ఖమ్మం నగరానికి చెందిన ఫిర్యాదుదారుడు మందడపు ప్రభాకర్‌రెడ్డి న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేశారు. కేసును విచారించిన న్యాయాధికారి వెంకటేశ్వర్లకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దురదపాడు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన బంధం సారయ్య(33) అదే గ్రామానికి చెందిన బంధం వెంకటేష్‌తో కలిసి ఆంధ్రాలోని కుక్కునూరు మండలానికి వెళ్లి మంగళవారం రాత్రి తిరిగి వస్తుండగా కుడుములపాడు సమీపంలో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇద్దరిని ఖమ్మం తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ సారయ్య బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21: ఉరివేసుకుని ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింహాపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహాపురం గ్రామానికి చెందిన సాహితి (14) తల్లంపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో సాహితి అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక మృతికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

యూపీఐ నుంచి నగదు పంపిస్తామని..

● రూ.3,500 నగదుతో పరార్

కరకగూడెం, ఫిబ్రవరి 21: యూపీఐ నుంచి డబ్బులు పంపిస్తామని చెప్పి, రూ.3,500 నగదుతో ఇద్దరు పరార్ అయిన సంఘటన మండలంలోని మోతెలో బుధవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె గ్రామంలో దుకాణదారుడు కాసు సంజీవరాజు దగ్గరికి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అత్యవసరంగా ఉంది, మా బంధువు విజయవాడ నుంచి మీకు ఫోన్ పే ద్వారా పంపిస్తాడు, రూ. 3,500 నగదు ఇవ్వమని నమ్మబలికారు. దుకాణదారుడి ఫోన్ నెంబర్‌ను తీసుకొని బంధువులకు ఇచ్చారు. ఇద్దరు వ్యక్తులు మీకు నగదు వచ్చాయని తెలపడంతో, బాధితుడు మేసేజ్ వచ్చినట్లు గమనించి దొంగలకు నగదు ఇచ్చాడు. నగదు తీసుకున్న వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సేపటికి సంజీవరాజు తన ఫోన్‌లో నగదు జమ కాకపోవడంతో వెంటనే వారిని పట్టుకునేందుకు వెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆక్రమణదారుడికి ఎన్నెస్పీ స్థలం స్వాధీనం



ఎన్నెస్పీ స్థలంలో షెడ్ వేసి మట్టి తోలుతున్న దృశ్యం

వైరా, ఫిబ్రవరి 21: వైరాలోని రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి విచిత్రంగా ఉన్న సంఘటన ఇది. జిల్లా కలెక్టర్ ఆదేశాలంటూ ఒక ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణదారుడిని ఖాళీ చేయించేందుకు బుజ్జగించిన రెవెన్యూ అధికారులు మరోచోట ఎన్నెస్పీ స్థలాన్ని స్వాధీనం చేయడం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికే ఎన్నెస్పీ స్థలంలో షెడ్ వేసిన సదరు ఆక్రమణదారుడు గతంలో తాను ఆక్రమించి నిర్మించుకున్న ఇంటిమెటీరియల్‌ను ఎన్నెస్పీ స్థలంలోకి బుధవారం తోలడం చర్చనీయాంశమైంది. వైరా ప్రభుత్వ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ, నీటిపారుదలశాఖ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి నిర్మాణాలు చేపట్టాడు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.నాలుగున్నర కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి ఈ అక్రమ నిర్మాణం అడ్డంకిగా ఉంది. అంతేకాకుండా సదరు వ్యక్తి ఈ నిర్మాణాన్ని తొలగించకుండా స్టే తెచ్చుకున్నారు. దాంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అప్పటి తహసీల్దార్ గత బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆక్రమణదారుడిని ఒప్పించి నిర్మాణాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అందుకు ప్రతిఫలంగా ఎన్నెస్పీ స్థలాన్ని ఆయనకు అప్పగిస్తామని అధికారు లు హామీ ఇచ్చినట్లు సదరు వ్యక్తి చెబుతున్నారు. పల్లెదవాఖానాకు కేటాయించి పెన్సింగ్ వేసిన ఎన్నెస్పీ స్థలంలో కొంత స్థలాన్ని సదరు వ్యక్తికి అప్పటి రెవెన్యూ అధికారులు చూపించటం, ఆవెంటనే ఆయన షెడ్ నిర్మించడం, గత ఆక్రమణ స్థలం నుంచి మట్టి తోలకాలు చేయడం వివాదంగా మారింది. వైరాలో ఇదే వరుస కొనసాగితే కోర్టు స్టేలు తెచ్చుకున్న ఆక్రమణదారులకు ఎన్నెస్పీ స్థలాలను అడ్డగోలుగా స్వాధీనం చేసి వారి డిమాండ్లకు అధికారులు తలవంచుతారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావును వివరణ కోరగా ఎన్నెస్పీ స్థలంలో తాము ఎవరికి పట్టాలు ఇవ్వలేదని, ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోలార్‌లో భద్రాద్రి రామయ్య కల్యాణం


కోలార్‌లో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 21: కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లో భద్రాద్రి రామయ్య కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామ ప్రచార రథం కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌కు తరలి వెళ్లింది. స్వామి వారిని అక్కడి భక్తులు దర్శించుకోగా బుధవారం నాడు శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సమయంలో ముందుగా విశ్వక్సెనపూజ, పుణ్యవచనం, కంకణధారణ యజ్ఞోపవీతదారణ, శుభ ముహూర్తం, జీలకర్ర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనంలో కళ్యాణ ప్రక్రియ ముగిసింది. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది శ్రీకాంతచార్యులు, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే రామయ్యకు నిత్యకళ్యాణం నిర్వహించారు.

రెండు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

కల్లూరు, ఫిబ్రవరి 21: కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ క్రీడా పోటీలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రాధయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, పసు మర్తి మోహన్‌రావు, గొర్రెపాటి రఘురామ్, బాగం ప్రభాకర చౌదరి ఏనుగు సత్యంబాబు, భూక్యా శివకుమార్‌నాయక్, కమిటీ నిర్వాహకులు ముజుమ్‌పాషా, అంజనేయులు, ఉదయ్, కిరణ్‌వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే భారీ ఉద్యమం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందా కృష్ణమాదిగ

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21: ఎస్సీ సామాజికవర్గంలో ఏబీసీడీ వర్గీకరణ చేయకపోతే దేశ వ్యాప్తంగా భారీ ఉద్యమం చేయడానికి సిద్ధమవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని అంబేద్కర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మందాక్రిష్ణ మాట్లాడుతూ ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఒక కమిటీని నియమించిందని, ఆ కమిటీ త్వరగా వర్గీకరణ చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. నియోజకవర్గం పరిధిలోని నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా ఐక్యమత్యంతో సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కొంతమంది నాయకులు పార్టీ సమావేశాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి కార్యక్రమాలను వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. పార్టీ పేర బెదిరింపులకు దిగొద్దని సూచించారు. అందరూ ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు తూరుగంటి రాము తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం కమీషనింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈవీఎం కమీషనింగ్‌పై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ కొండపల్లి శ్రీరామ్, మదన్‌గోపాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, పీవో, ఏపీవోలకు బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్‌ల అమరిక, పనితీరు, మాక్‌పోల్, పోలింగ్ సమయంలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు పోలింగ్, మాక్‌పోలింగ్ సమయంలో నిర్వర్తించవలసిన విధులు, నింపాల్సిన పత్రాలపై వివరించారు. మాస్టర్ ట్రైనర్లు శిక్షణకు సంబంధించి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి రాజేశ్వరీ, డీపీవో విజయనిర్మల, మాస్టర్ ట్రానర్స్, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

నిరుపేదలకు పోలీస్‌శాఖ ఎప్పుడూ అండగా ఉంటుంది: ఏఎస్పీ


నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

చర్ల, ఫిబ్రవరి 21: నిరుపేదలకు పోలీస్‌శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. బుధవారం చర్ల మండలంలోని కిష్టారంపాడు గ్రామంలోని సుమారు 50 కుటుంబాలకు నిత్యావసరాలు, గిన్నెలు, ఇతర వస్తువులు పోలీస్ శాఖ ద్వారా అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. చర్ల పోలీసులు ఎప్పుడూ సేవ చేయడంలో ముందుంటారన్నారు. గిరిజనులు ఎవరూ మవోయిస్టులకు సహకరించవద్దన్నారు. వారితో ప్రజలకు వచ్చిన లాభం ఏమీ లేదన్నారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చర్ల సీఐ ఆలెం రాజువర్మ, ఎస్ఐలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి ఇతరులు ఉన్నారు.

సైబర్ వల

» సోషల్‌మీడియా వేదికగా కేటుగాళ్ల ట్రాప్
» అత్యాశకు పోయి నష్టపోతున్న జనం


ఖమ్మం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఆన్‌లైన్ ఉద్యోగాల కోసం అనధికారిక వెబ్‌సైట్లలో లాగిన్ అయితే సైబర్ నేరగాళ్లు ముందుగా వారి సమాచారాన్ని దొంగిలిస్తారు. ఆ తర్వాత నేరుగా ఆయా వ్యక్తులకు ఫోన్లు చేయడం, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపడం వంటివి చేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎవరైనా స్పందిస్తే వారిని తమ ట్రాప్‌లోకి లాగుతారు. ఇంటి వద్దే కూర్చుని పనిచేసుకోవచ్చని, ఎంత సమయం పనిచేస్తే అంత ఎక్కువ సంపాదించొచ్చని ఊరిస్తూ వ్యక్తిగత సమాచారం కోసం కూపీ లాగుతూ బాధితులను బుట్టలో వేసుకుంటారు.

రోజుకు రూ.2నుంచి రూ.6వేల వరకు సంపాదించే అవకాశం ఉందని ఆఫర్లు ఇస్తారు. ఎంచుకున్న వ్యక్తిని మోసం చేసే క్రమంలో వారిని నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు ముందుగా పెద్దపెద్ద కంపెనీల పేర్లను సైతం ప్రస్తావిస్తారు. అలా చెప్పిన అనంతరం సామాజిక మాధ్యమాల్లోని కొన్ని ఎంటర్‌టైన్‌మెంట్ ఛానళ్లను సబ్‌స్క్రిప్షన్ చేసుకోవాలని, వాటిని సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం ఫోన్‌లో స్క్రీన్‌షాట్ తీసి తమకు పంపితే నగదు పంపుతామని చెబుతారు. అలా రెండుమూడుసార్లు పంపిన సబ్‌స్క్రిప్షన్లకు అనుగుణంగా బాధితుల అకౌంట్లలో నగదు జమచేస్తారు.

అది నిజమని బాధితులు నమ్మిన తర్వాత వారికి టెలిగ్రామ్‌లింకులు పంపి గ్రూపుల్లో యాడ్ చేస్తారు. వాటిల్లో పదులసంఖ్యలో వ్యక్తులున్నట్టుగా చూపించి ప్రీపెయిడ్ టాస్క్‌లలో పాల్గొనడం ద్వారా ఎక్కువ మొత్తంలో నగదు సంపాదించవచ్చని భ్రమకలిగేలా సదరు గ్రూపులో సందేశాలను పంపుతుంటారు. అక్కడి నుంచి మొదలుకుని సంబంధిత అంశాల్లో మూడు నాలుగు సార్లు వారు చెప్పిన సూచనలకు అనుగుణంగా నడుచుకుంటూ నగదు చెల్లించేలా నమ్మించి ఆ తర్వాత ఆ గ్రూపును తొలగిస్తారు.

మరికొంతమంది సైబర్ నేరగాళ్లు ఏదో ఒక కంపెనీ పేరు పంపి, ఆ కంపెనీకి సంబంధించి

అధికారిక వెబ్‌సైట్ లింకు తమకు పంపాలని సూచించి నమ్మకం కలిగేలా చేస్తారు. ఇలా బాధితులే నేరుగా వారు పంపిన అకౌంట్లలో నగదు జమచేసేలా నమ్మించి దోచుకుంటున్నారు. అంతేకాకుండా పలు రకాల లోన్ యాప్‌ల పేరుతో పాటు క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ యాప్‌ల వంటి వాటితోనూ సైబర్ కేటుగాళ్లు దోపిడీకి పాల్పడుతున్నారు.



ఇటీవల టాస్క్ పేరుతో ఓ వ్యక్తికి పంపిన సందేశం

నెలకు రూ.కోట్లల్లోనే దోపిడీ

కొంత కాలంగా పోలీసులు సైబర్ సెక్యూరిటీ బృందాలను బలోపేతం చేస్తున్నా సైబర్ నేరగాళ్లు అంతకుమించిన అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. ఇటీవల నమోదైన సైబర్ నేరాల్లో అత్యధికంగా సబ్‌స్క్రిప్షన్లకు సంబంధించిన టాస్క్‌లే ఉంటున్నాయి. గడిచిన ఐదు నెలల్లో ఖమ్మం జిల్లాలో సుమారు 100 వరకు ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన కేసులు నమోదుకాగా, బాధితులు సుమారు రూ.5కోట్ల వరకు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. అయితే సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేయడం ఆలస్యమవుతున్న కొద్దీ తాము మోసపోయిన నగదు కరిగిపోతుందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.

అంతేకాకుండా ఆయా కేసుల చేధించడంలోనూ వారు వ్యయప్రయాసలకు గురికావాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ఫిర్యాదు చేసే సమయానికి నేరగాళ్లు అకౌంట్ల నుంచి నగదు డ్రా చేస్తుండటంతో వారు పోగొట్టుకున్న నగదు తిరిగి రికవరీ చేయడం సాధ్యం కావడం లేదు. ఫలితంగానే రికవరీ మూడు నుంచి ఐదుశాతం మించడం లేదు. ఒక్కోసారి బాధితులు పంపిన అకౌంట్లలోని నగదు మూడు నాలుగు బ్యాంకుల అకౌంట్లకు మారిన సందర్భంలో ఆయా అకౌంట్లను హోల్డ్ చేసిన కేసులు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నాయి. అలా హోల్డ్‌లో ఉంచిన నగదును బాధితులకు ఇప్పించేందుకు ఒక్కో కేసుకు వారం రోజులు పడుతున్నట్టు తెలుస్తోంది. అయినా పోలీసులకు అసలు నేరస్థులను గుర్తించడం కష్టంగా మారుతోంది.

అత్యాశకు పోతే...

సైబర్ నేరగాళ్లు నమ్మదగిన కంపెనీల పేర్లు చెబుతుండడంతో బాధితులు వారు చెప్పే సూచనలను అనుసరించడం మినహా మిగిలిన అంశాలను పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా వారు ఇచ్చే టాస్క్‌లలో రెట్టింపు చెల్లింపులు ఉంటాయని ఆశ చూపడంతో నేరుగా సైబర్ నేరగాళ్లు చెప్పిన అకౌంట్లలో నగదు జమచేస్తున్నారు. తీరా మోసపోయాక లబోదిబోమంటున్నారు. కొద్ది నెలల క్రితం వెలుగులోకి వచ్చిన 'క్రిప్టో కరెన్సీ' మోసం కూడా ఈ కోవకు చెందినదే. క్రిప్టో కరెన్సీ యాప్‌లో నగదు పెడితే కొద్ది రోజుల తర్వాత తిరిగి చెల్లింపులు వస్తాయని నమ్మి జిల్లాలో వందల సంఖ్యలో బాధితులు మోసపోయారు. ప్రస్తుతం ఆయా యాప్ నిర్వాహకుల ఆచూకీ కూడా సైబర్ పోలీసులకు దొరకని పరిస్థితి నెలకొంది. అపరిచితుల అకౌంట్లలో నగదు వేసేముందు కానీ, అనధికారిక ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ, లోన్‌యాప్‌లను తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకునేముందుగానీ ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై నిర్బంధం ఆపాలి: సీపీఎం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 21: స్వామినాథన్ కమిషన్ సిఫారస్సుల మేరకు పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని ఢిల్లీ సరిహద్దులో రైతులు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోగా నిర్బందాలను విధిస్తుందని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు నిరసన ఏఐపీకేఎస్ పిలుపు

ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడులు చేయటంపై గురువారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి21: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 బాలురు, బాలికల, సీనియర్ మెన్ అండ్ ఉమెన్స్ 400 మీటర్ల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శుక్రవారం స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

అపురూపం.. ప్రతిబింబం..

నేడు కవలల దినోత్సవం

» ఆశ్చర్యపరిచే ఒకేరకమైన పోలికలు, అలవాట్లు

ఖమ్మం సాంస్కృతికం/ పాల్వంచ, ఫిబ్రవరి 20: సృష్టిలో ఒక అద్భుతం కవలలు, కొద్ది పాటి క్షణాలు, నిమిషాల తేడాతో ఒకే తల్లికి జన్మించిన కవలలు తల్లి దండ్రులకే కాక బంధుమిత్రులకు ఎప్పటికీ ఆశ్చర్యమే.. వారు వీరని పొరపడటం, ఇందుకు కారణం.. ఒక తరహా కవలలు ఈవిధంగా ఉంటే మరొక తరహాల్లో ఏమాత్రం పోలికలు ఉండకుండా భిన్నంగా జన్మించటం గమనార్హం.. కవలలు ఇద్దరూ మగ, ఇద్దరు ఆడ మాత్రమే కాక ఒక ఆడ, మరొక మగ శిశువులు జన్మించే సందర్భాలు కూడా ఉన్నాయి. జన్యుపరమైన కారణాల నేపథ్యం కవలల జన్మకు కారణం కాగా కవలల విషయంలో అనేక నమ్మకాలు కూడా చోటు చేసుకున్నాయి. కవలలు రూపురేఖల్లో మాత్రమే కాక ఆహార అలవాట్లు, మనస్తత్వాల్లోనూ ఒకే విధంగా ప్రవర్తించే వారు పూర్తి వ్యతిరేకంగా ప్రవర్తించే వారూ ఉన్నారు. ఒకే విధంగా ఉన్నా లేక పోయినా తల్లిదండ్రులు తమ కవలల పేర్ల విషయంలో ఒకే విధంగా స్ఫురించే పేర్లను పెట్టేందుకు, దుస్తులు వేసేందుకు ఆసక్తి చూపుతారు..

అనుదీప్, మణిదీప్



ఖమ్మం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్‌కు చెందిన తలారి సురేష్, మహాలక్ష్మి దంపతుల కవల సంతానమైన అనుదీప్, మణి దీప్ రూపురేఖల్లో ఒకేలా ఉండి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. వీరి బంధువులతో పాటు, చుట్టుపక్కల వారు, స్కూల్ మిత్రులు వీరిలో ఎవరు ఎవరో పోల్చులేక తికమకకు గురవుతుంటారు.

లోహిత్, రోహిత్



ఆహార్యంతోపాటు అభిరుచుల్లోనూ ఒకే విధంగా ఉండే లోహిత్, రోహిత్, సినిమాల్లో మాదిరిగా అందరినీ తికమకకు గురిచేస్తుంటారు. సత్తుపల్లికి చెందిన వెంగపాక సుజాత పరమేశ్వరచారి కుమారులైన వీరు బీటెక్ చదువుతున్నారు. వీరి పేర్లతోపాటూ రూపము, గుణమూ ఒకేలా ఉండటం విశేషం..

పారుపల్లి జుహిత్, జునిత్



ఖమ్మం నగరంలోని వీడివోస్ కాలనీకి చెందిన పారుపల్లి సాయికృష్ణవేణి, రాజేష్ కుమారులు జుహిత్, జునిత్‌లు ఆహార్యంలో ఒకేలా ఉంటారు. ఒకేసారి చూస్తే ఇద్దరిని పోల్చుకోవడం కష్టంగా ఉంటుంది. ప్రస్తుతం వీరు 2వ తరగతి చదువుతున్నారు.

సహస్ర, సమన్వి



పాల్వంచ: పాల్వంచ పట్టణానికి చెందిన మెడికల్ షాపు నిర్వహకుడు మేదరమెట్ల శ్రీనివాసరావు- హిమబిందు దంపతుల తనయులు మేదరమెట్ల సహస్ర- సమన్విలు కవలలుగా జన్మించారు. చిన్ననాటి నుంచి వారిద్దరి అభిప్రాయాలు, అభిరుచులు ఒకే విధంగా ఉండేవి. చదువులోనూ ఇద్దరూ సమఉజ్జీలుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.

కొబ్బరిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపచేయాలి

» కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు


మాట్లాడుతున్న ఆలపాటి రామ్మోహనరావు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21: కొబ్బరి సాగు రైతులకు మంచి లాభాలను అందిస్తుందని, దీనిని రాష్ట్రవ్యాప్తంగ విస్తరింపచేస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలంగాణ కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామ్మోహనరావు అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు వేదికలో ఉమ్మడి జిల్లాల కొబ్బరి రైతుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కొబ్బరి బోర్డు అధికారులు, స్థానిక వ్యవసాయ, ఉద్యాన అధికారులు సాగులో అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రామమోహనరావు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో కొబ్బరి బోర్డు అందుబాటులో ఉండేదని, తెలంగాణ ఏర్పాటు తరువాత ఈ కేంద్రం ఏపీలోకి వెళ్లిపోయిందన్నారు. తెలంగాణాలో కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలని, రైతులకు ఆర్థికంగ వెసులుబాటు కల్పించేందుకు సొసైటీలుగ ఏర్పాటు చేసి బోర్డు నుంచి వచ్చే రాయితీలను వర్తింపచేయాలని కోరారు. రైతులకు సాగులో మెళకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో కె పుల్లయ్య, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు

అధికారులతో సమానంగా గ్రాట్యుటీ చెల్లించాలి

» మంత్రి తుమ్మలను కోరిన రిటైర్డ్ కార్మికులు
» సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లిన మంత్రి

ఇల్లెందు, ఫిబ్రవరి 21: సింగరేణి కాలరీస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి విశ్రాంత కార్మికులకు పెరిగిన రూ.20లక్షల గ్రాట్యుటీని సింగరేణి విశ్రాంత అధికారులతో పాటు 2017జనవరి నుంచి వర్తింపచేయాలని సింగరేణి విశ్రాంత కార్మికులు బుధవారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కోరారు. ఖమ్మంలో మంత్రి తుమ్మలను కలిసిన విశ్రాంత కార్మికులు సింగరేణి అధికారులకు ఉద్యోగ విరమణ అనంతరం జనవరి 2017నుంచి రూ.20లక్షల గ్రాట్యుటీని వర్తింపచేస్తున్నారని, సింగరేణి కార్మికులకు మాత్రం 2018మార్చినుంచి అమలు చేస్తున్నారని వివరించారు. బొగ్గు గనుల్లో పనిచేసిన కార్మికుల పట్ల సింగరేణి యజమాన్యం వివక్షత చూపిందని వారు పేర్కొన్నారు. గ్రాట్యుటీని రూ.20లక్షలకు పెంచుతూ అమలు చేసిన విధాన నిర్ణయాన్ని కార్మికులకు, అధికారులకు ఒకేమాదిరిగా వర్తింపచేయకుండా కార్మికులపై వివక్షత చూపారని వారు మంత్రి తుమ్మల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై వివక్షత చూపడం వలన 2500మంది విశ్రాంత సింగరేణి కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. ఈ మేరకు స్పందించిన మంత్రి తుమ్మల సింగరేణి కాలరీస్ సీఎండీ బాలరాంనాయక్‌కు ఫోన్‌చేసి కార్మికుల పట్ల వివక్షతను తీసుకెళ్లారు. అధికారుల మాదిరిగానే కార్మికులు సైతం సింగరేణి సంస్థ పురోభివృద్ధికి కృషి చేశారని అధికారులకు అమలుచేసిన తేదీనుండే పెరిగిన గ్రాట్యుటీ రూ.20లక్షలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సింగరేణి కాలరీస్ విశ్రాంత కార్మిక నాయకులు కనగాల పేరయ్య, మల్లెల వెంకటేశ్వర్లు, ఎస్కే ఇమామ్, కె.మన్మదరావు, రమణ, రంగనాద్, బసవయ్య తదితరులు ఉన్నారు.


మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

'కట్ట'లో కలిసింది

» భద్రాద్రి కరటకట్ట నిర్మాణంలో కలిసిపోనున్న పల్లె ప్రకృతివనం » రూ.లక్షల్లో ప్రజాధనం వృథా

భద్రాచలం, పిబ్రవరి 21: గోదావరి వరదతో ముంపునకు గురయ్యే ఆ ప్రాంతంలో ఎప్పటికైనా ముంపు నుంచి రక్షణ కోసం కరకట్ట కడతారు. ఈ విషయం ప్రభుత్వ అధికారులకు తెలిసినా ముందు చూపు కొరవడటం తో బృహత్ పల్లె ప్రకృతివనం మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈజీఎస్‌లో భాగంగా మొక్కలు పెంచడంతో పాటు చుట్టూర ఫెన్సింగ్ స్ప్రింకర్లు, 5 హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేశారు. దీనికి విద్యుత్ సౌకర్యం అందించేందుకు ప్రత్యేక విద్యుతు లైన్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించారు. ఈ క్రమంలో 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా 71.3 అడుగులు రావడంతో బృహత్ పల్లె ప్రకృతివనంతో పాటు పరిసరాల్లో ఉన్న పలు కాలనీలు నీట మునిగాయి. దీంతో ఆ కాలనీవాసులు తమకు గతంలో ఇచ్చిన హామీలో భాగంగా వరదల నుంచి శాశ్వత రక్షణ కోసం కరకట్ట నిర్మాణం చేపట్టాలని అప్పటి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ క్రమంలో 2023 అక్టోబరులో రూ.38.045 కోట్లు మంజూరు కావడం, పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో కరకట్ట నిర్మాణం పనులకు నీటిపారుదల శాఖ అధికారులు టెండర్లను ఆహ్వానించడంతో పనులను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇందులో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బృహత్‌పల్లె ప్రకృతివనం కరకట్ట నిర్మాణంలో కలిసిపోనుంది. ఇది ఆనాడు అధికారుల ముందు చూపు లేమి కారణంతోనే జరిగిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.


తొలగించిన మొక్కలు

నాడు ఐదున్నర ఎకరాల్లో పల్లె ప్రకృతివనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కరకట్ట నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో పట్టణ శివారు వరకు కరకట్టను నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ఆనాడే ముందస్తుగా 33 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇందుకు సంబంధించి సంబంధిత రైతులకు నష్టపరిహారం కూడా చెల్లింపు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ 33 ఎకరాల పరిధిలోనే 2020-21 సమయంలో అప్పటి ఉన్నతాధికారులు ఐదున్నర ఎకరాలను బృహత్ పల్లె ప్రకృతివనానికి కేటాయించారు. ఇందులో గానుగ, రావి, ఇతరత్రా వృక్ష జాతికి చెందిన మొక్కలను నాటి వాటి సంరక్షణకు సిబ్బందిని సైతం నియమించారు. అంతేకాదు వాటి కోసం స్ప్రింక్లర్లు, మోటార్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల మూడేళ్లలో వచ్చిన వరదల సమయంలో ఈ ప్రాంతం వరద ముంపుకు సైతం గురైంది.


గతంలో ఉన్న పల్లెప్రకృతివనం ఇదే

రూ.లక్షల ప్రజాధనం వృథా

అధికారుల ముందుచూపు లేమి కారణంగా రూ.లక్షల విలువైన ప్రజాధనం దుర్వినియోగమైందనే విమర్శలు స్థానికుల నుంచే వ్యక్తమవుతుండటం గమనించదగ్గ విషయం. కరకట్ట నిర్మాణం చేపడతారని తెలిసినా ఏ విధంగా మొక్కలను ఈ ప్రాంతంలోనే పెంచారని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా 700 మీటర్లతో కరకట్ట నిర్మాణం చేపడుతున్న క్రమంలో అందులో బృహత్ పల్లెప్రకృతివనం కనుమరుగు కానుండటం అధికారుల ముందుచూపులేమికి నిదర్శనమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల మిగులు కరకట్ట పనులు ప్రారంభం కావడంతో స్ప్రింకర్లను, మోటార్లను, మొక్కలను తొలగించారు.



స్ప్రింకర్లను తొలగించిన దృశ్యం

ఎస్సీ కార్పొరేషన్‌లో పదోన్నతులు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి21: సాంఘీక సంక్షేమ శాఖలో సినియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. ఖమ్మం ఎస్సీడీడీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెక్కిరాల శ్రీనివాస్‌కు కొత్తగూడెం ఎస్సీ కార్పొరేషన్ పర్యవేక్షకులుగా, మరో సీనియర్ అసిస్టెంట్ వీ.రవికుమార్‌కు టీఎస్‌డబ్ల్యూ రెసిడెంట్‌స్కూల్‌లో పర్యవేక్షకులుగా పదోన్నతి పొందారు. బుధవారం ప్రమోషన్ పత్రాలను అందించారు.

పంటలను పరిశీలించిన జేడీఏ

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి21: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మిర్చి, వరిపంటలను జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల పరిశీలించారు. హస్నాబాద్, రఘునాధపాలెం, లక్ష్మీదేవితండా, సుబ్లేడు, తదితర గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమం పరిశీలించారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలు సూచనలు పాటించి మందులు పిచికారి చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏవో నారెడ్డి సీతారామిరెడ్డి, ఏఈవో బాలకృష్ణ, పాల్గొన్నారు.

సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి

» తీర్థాల జాతర నిర్వహణ సమీక్షలో ఆర్డీవో గణేష్

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి21: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తీర్థాల జాతర విజయవంతం చేయాలని ఆర్డీవో గణేష్ అధికారులకు సూచించారు. మండల పరిదిలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో మహాశివార్రాతి సందర్బంగా నిర్వహించనున్న జాతర ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ అధికారులు రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి, రహదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్తు అధికారులు ఆలయ ప్రాంగణం, జాతర జరిగే ప్రదేశాలు, పార్కింగ్ ప్రదేశాల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాది మున్నేరులో నీళ్లలేకపోవడం వల్ల భక్తులకు ఇబ్బందులు వస్తాయని, తీర్థాల చెక్ డ్యాం పైన ఉన్న నీటిని చెక్ డ్యాం దాటించి ఆలయం వరకు నీళ్ల వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది జాతరలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఆలయం వరకు నీళ్ల వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుధ్య


తీర్థాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గణేష్

పనులు చేట్టాలన్నారు. జాతరకు రెండు రోజుల ముందుగానే ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీపీ బెల్లం ఉమా, ఎంపీటీసీ కళ్లెం వెంకటరెడ్డి, దేవాదాయ శాఖ ఆర్ఐ సమత, ఆలయ ఈఓ శేషయ్య, సీఐ రాజిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నెలాఖరులోగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

కల్లూరు, ఫిబ్రవరి 21: రేషన్ కార్డుల వినియోదారులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియను నెలాఖరుకు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ రెవెన్యూ అధికారులను కోరారు. బుధవారం కల్లూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ దరఖాస్తులు, ఫారమ్- 6 దరఖాస్తుల ప్రకియను పరిశీలించారు. ఆహార భద్రత కార్డు గల కుటుంబ సభ్యులు తప్పని సరిగ్గా ఈకేవైసీ చేయించాలని, సదరు కార్డులో గల కుటుంబ సభ్యుల్లో ఎవరైన తెలంగాణ రాష్ట్రంలో వేరే ప్రాంతంలో ఉన్న మీసేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్, ధరణీ దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి వాటిని పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆశోకచక్రవర్తి, తహసిల్దార్ సాంబశివుడు, మురళిధర్‌రావు, ఆర్ఐలు అన్వర్, స్టాలిన్ పాల్గొన్నారు.

కొణిజర్ల: కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

రికార్డురూంను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షను నిర్వహించారు. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ ఓట్లకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని అడిగారు. అందరూ ఓటింగ్‌ను దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు. రెవిన్యూకు సంబందించిన సమస్యలన్ని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ యర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో సీసీరోడ్డును నిర్మించుకున్నాం

సూరంపల్లి రామారావు

కొణిజర్ల,ఫిబ్రవరి21: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కృషితో కొణిజర్లలో రూ.30లక్షలతో సీసీరోడ్డును నిర్మించుకున్నామని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్లమెంట్ ఎల్డీఎం కన్వీనర్ సూరంపల్లి రామారావు తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే నిధులు, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును సూరంపల్లి రామారావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే ద్వారా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మోష పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న సూరంపల్లి, కోసూరి

24న ఐఏఎల్ జిల్లా మహాసభలు

సత్తుపల్లి,ఫిబ్రవరి21: ఖమ్మంలో జరగనున్న జిల్లా మహాసభల పోస్టర్‌ను సత్తుపల్లిలో బుధవారం బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మహాసభలను జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలపాటి శ్రీనివాసరావు, బొర్రా వెంకటరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ హిమావలి, మేడా అజయ్‌కుమార్, తనగాల అరుణకుమారి, షేక్ జీనతస్నీషా, మోదుగు నరేష్, షేక్.లతీఫ్, మేకల నవీన్‌కుమార్, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

చింతకాని, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని రైల్వేకాలనీ గ్రామంలో సీసీ రోడ్లకు ఎంపీపీ కోపూరి పూర్ణయ్య గురువారం శంకుస్థాపన చేశారు. రూ.7.5 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, బందెల నాగార్జున, కొప్పుల గోవిందరావు, కంభం వీరభద్రం, మాజీ సర్పంచ్ పరిటాల యలమంద, కాంపెల్లి శేషగిరిరావు, గంట బాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఏఐటీయూసీ గుర్తింపుకార్డులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 21: ఆటో కార్మికులకు ఏఐటీయూసీ గుర్తింపు కార్డులను మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మమత ఆటో సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్కే జానిమియా, ఏనుగు గాంధీ, ఉపేందర్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి సరుకుల పంపిణీ

ఖమ్మంసాంస్కృతికం, ఫిబ్రవరి20: లయన్స్‌క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో బుధవారం వృద్ధురాలికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. భక్తపోతన వీధికి చెందిన వేములపల్లి రాజేశ్వరి భర్త చనిపోయాడు. రాజేశ్వరి ఇద్దరు సంతానం మానసిక వికలాంగులు కావటంతో సరుకుల పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పూర్ణచందర్‌రావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూముల్లో ఇళ్లు నిర్మించొద్దు

సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు



సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21: అసైన్‌మెంట్ భూముల్లో అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించొద్దని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పన్నులు ఈఏడాది రూ.4.5కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు రూ.2.8కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. ఏడాదిలో పన్నులో సగం మొత్తాన్ని రెండు విడతలలో జూన్ 30లోపు, మిగతా మొత్తాన్ని డిసెంబర్ 31లోగా చెల్లించాలని, లేకుంటే నెలకు రూ.2శాతం వడ్డీ పడుతుందని, ఏడాదిలోగా చెల్లించకపోతే 12శాతం వడ్డీతో కలిపి గృహవినియోగదారులు కాంపౌండ్ ఇంట్రస్ట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో సుమారు 5వేల వరకు నీటి కనెక్షన్లు ఉండగా వాటిని కూడా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. సెల్ఫ్‌అగ్రిమెంట్‌తో వ్యాపారస్థులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. జీప్లస్-1అనుమతులు ఉంటే అదనంగా నిర్మించినట్లయితే చర్యలు తప్పవని అన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

108ద్వారా అత్యవసర సేవలు అందించాలి

తల్లాడ,ఫిబ్రవరి21: 108వాహనం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేంద్ర కోరారు. బుధవారం తల్లాడలో 108వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సేవల పరికరాలను పరిశీలించారు. వాటి ఉపయోగాల గురించి సిబ్బంది ఈఎంటీటీ రామారావు, డ్రైవర్ నర్సింహారావుకు పలు సూచనలు చేశారు.

రాజకీయాలు ఆదర్శంగా ఉండాలి..

- » లబ్ధిదారులు ఏ పార్టీలో ఉన్నా వారికి ఫలాలు అందాలి
- » ఆ రోజుల్లో రాంరెడ్డి నేను అనదమ్ముల్లా కలిసి పనిచేశాం
- » ఇప్పుడు ఒకే పార్టీలోని ఎమ్మెల్యేలే సఖ్యతగా ఉండటం లేదు
- » ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి

రఘునాథపాలెం, ఫిబ్రవరి21: రాజకీయాలు చేస్తే పద్ధతి ప్రకారం గౌరవంగా ప్రజలు మెచ్చుకొనేలా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తిలో బుధవారం తమ్మిని నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల మాట్లాడారు. తానెవ్వరో తెలియకపోయినా తన గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు కృషి చేశారని, వారికి తానెప్పుడూ కృతజ్ఞతగా ఉంటానన్నారు. రఘునాథపాలెం మండలంలో గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురి చేసినా కాంగ్రెస్‌కు మెజారిటీ ఇచ్చి గెలిపించారని తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. నాయకులు ఎప్పుడూ కార్యకర్తల స్థాయి నుంచి ఎదగాలని, పైస్థాయి సిఫారసుతో నాయకులుగా ఎదిగిన వారు ఎక్కువకాలం నాయకత్వం చేయలేరని వ్యాఖ్యానించారు. అర్హత కలిగిన లబ్దిదారులు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా వారికి సంక్షేమ పథకాల ఫలాలు అందాలని అన్నారు. దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డితో తనకు మంచి జ్ఞాపకాలు ఉన్నాయని, అన్నదమ్ముల్లా కలిసి పనిచేశామని తుమ్మల గుర్తు చేసుకున్నారు. తాను మంత్రిగా ఉంటే వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో ఉన్నారని, తాను ఎమ్మెల్యే అయితే వెంకటరెడ్డి మంత్రిగా పని చేశారని అభివృద్ధిలో కలిసి పనిచేశామని వివరించారు. ఒకే పార్టీలో లేకున్నా ఆదర్శవంతమైన రాజకీయాలు ఆనాడు ఉండేవన్నారు. కానీ ఇప్పుడు రాజకీయాలు బాగా లేవని, ఒకే పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలకు తోటి ఎమ్మెల్యేలే గౌరవం ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. ఈ సందర్భంగా పాపటపల్లి మాజీ సర్పంచి దుంపటి నగేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రభుత్వ అధికారుల తీరు ఉందన్నారు. వాంకుడోత్ దీప్లానాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక అక్రమ కేసులు బనాయించారని వాటిని తొలగించేందుకు మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. గణేశ్వరంలో బీసీ పోడు రైతుల భూములకు బోర్లు వేయటానికి ఐటీడీఏ అధికారులు అడ్డుకుంటున్నారని, రజబ్‌అలీ నగర్‌లో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, పువ్వాడ ఉదయ్ నగర్‌లో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, దోనబండకు రహదారి నిర్మాణం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఎంపీటీసీ మాలోత్ లక్ష్మి, మాజీ సర్పంచులు కాపా అదినారాయణ, బండి వెంకన్న, దేవ్‌సింగ్, పేరపాక సీతారా ములు, సూతగాని గోపయ్య, బుయచ్చాలు, కేతినేని సీతారామయ్య, సూతగాని సురేశ్, కొత్త కోమరయ్య, జీడిమట్ల వెంకట్రాములు, ధరావత్ వెంకన్న, సూరిపి శ్రీనివాసరావు, మాలోత్ వస్రాం, భూక్య వెంకన్న, పటాన్ ఇస్మాయిల్, ఎస్కే మహ్మద్ ఆలీ పాల్గొన్నారు.

కేపిఎల్ క్రికెట్ టోర్నీ టీ-షర్టుల ఆవిష్కరణ

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన మరిన్ని వసతులు, సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ టీ-షర్టుల ఆవిష్కరణ చేశారు. క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ తీసుకొని రాష్ట్ర, జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. స్టేడియం మొత్తం తిరుగుతూ అభివృద్ధి చేయాల్సిన పలనులపై ఆరా తీశారు. స్టేడియంలో ఉన్న ఫ్లడ్‌లైట్లు డేనైట్ క్రికెట్ పోటీలకు లైటింగ్ వెలుతురు సరిపోతుందా అని అధికారులను అడిగారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డిని ఆదేశించారు. కార్పోరేటర్ కమర్తపు మొరళి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు కూరపాటి ప్రదీప్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్‌రెడ్డి, తుపాకుల యలగొండస్వామి తదితరులు ఉన్నారు.

ఏలూరి నివాసానికి వెళ్లిన తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం:కాంగ్రెస్ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు నివాసానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం రాత్రి వెళ్లారు. ఏలూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కొంత సమయం ముచ్చటించారు. తేనీటి విందును తుమ్మల స్వీకరించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మక్కసారక్క గద్దెల వద్ద పూజలు చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మంసాంస్కృతికం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలోని ధంసలాపురం ఆర్ వోబీ వద్దగల సమ్మక్క, సారక్క గద్దెలను దర్శించుకున్నారు. నిర్వాహకులు మంత్రిని సంప్రదాయ పద్దతిలో ఘనంగా స్వాగతించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

ఖమ్మంసాంస్కృతికం,ఫిబ్రవరి20: వీడీవోస్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజున స్వామి వార్లకు వసంతోత్సవం, చక్రస్నాన కైంకర్యం, శాంతిహోమం, పూర్ణాహుతి, పల్లకీసేవ, ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్‌బాబు, ఏపూరి మధుసూదన్‌రావు, వెంకటేశ్వరరావు, భవనాశి కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి21: నగరంలోని 41వడివిజన్ కవిరాజ్‌నగర్ రోడ్ నెంబర్6 నుంచి సీక్వెల్ రోడ్ మినిట్యాంక్‌బండ్ ఏరియా వరకు డ్రెయిన్ల పూడిక తీశారు. ఈ పనులను మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో కలిసి బుధవారం పరిశీలించారు.

గ్రామదీపికలకు శిక్షణ కార్యక్రమం

కల్లూరు, ఫిబ్రవరి21 కల్లూరులోని ఉషోదయ సమైఖ్య కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ చైతన్యం, సంక్షేమ అభివృద్ధి పథకాలపై గ్రామదీపికలకు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ డిపిఎం శ్రీనివాసరావు, ఎపిఎం వెంకటారామారావు పలు సూచనలు చేశారు.

చెరువులో అక్రమంగా తవ్విన బావిని పూడ్చేయాలి

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి21: మండల పరిధిలోని గోళ్లపాడులో అక్రమంగా తవ్విన బావిని వెంటనే పూడ్చివేయాలని తహసీల్దార్ రాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. గతంలో లోకాయుక్త ఆదేశాలతో చెరువులో తవ్విన అక్రమ బావులన్నింటినీ అధికారులు పూడ్చివేశారు. మళ్లీ చెరువులో బావి తవ్వేప్రయత్నం చేయగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు చెరువువద్దకు వెళ్లి పరిశీలించారు. తవ్విన బావిని వెంటనే పూడ్చివేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజారావు, ఆర్ఐ. క్రాంతి, నీటిపారుదల శాఖ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని జలగంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామీణఉపాధిహామీ సామాజిక తనఖీ ప్రజావేదిక సాదాసీదాగా సాగింది. తనిఖీసిబ్బంది రిపోర్టులు చదవడం, అధికారులు వినడం వరకే పరిమితమయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేసిన రూ. 5.61 కోట్ల విలువైన పనులపై ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాలలో కొందరు పని కావాలని అడిగినప్పటికి అధికారులు పనులు కల్పించలేదని తెలిపారు. తెల్దారుపల్లిలో పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కలు సక్రమంగా లేవని ఖర్చు పెద్ద మొత్తంలో చేశారని, ఎక్కువ గ్రామాల్లో మస్టర్లలో తప్పిదాలు జరిగాయని ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చింది. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ బెల్లం ఉమా, ఎంపీఓ రాజారావు, ఏపీవో శ్రీదేవి, ఎస్‌ఆర్‌పీ రమేష్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మట్టి అక్రమ రవాణా

» తూతూమంత్రంగా దాడులు,
ఆపై పట్టించుకోని అధికారులు



మట్టి అన్‌లోడ్ చేస్తున్న టిప్పర్, మట్టి కోసం తవ్విన గోతులు

సత్తుపల్లి, ఫిబ్రవరి21: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణ కొనసాగుతూనే ఉంది. జిల్లాలో మట్టి అక్రమంగా తవ్వి తరలించాలనే పేరుతో ఇతర ప్రాంతాలలో కొందరిపై కేసులు నమోదైనా సత్తుపల్లి నియోజకవర్గంలో మాత్రం ప్రత్యేక సామ్రాజ్యంగా వ్యాపారులు వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ నెల 11కి ముందు ఆంధ్రజ్యోతిలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై వరుస కథనాలు వెలువడటంతో మైనింగ్ అధికారులు మొక్కుబడిగా దాడులు నిర్వహించి మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాతో వదిలేశారని ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత రెండు మూడు రోజులు నిలిచిపోయిన మట్టి తవ్వకాలు, రవాణా తిరిగి రెట్టింపు స్థాయిలో కొనసాగుతోంది. సత్తుపల్లి మండలం కొత్తూరు పరిసర ప్రాంతాలలో ఏ రకమైన అనుమతులు లేకుండా పెద్ద సంఖ్యలో వ్యాపారులు మట్టిని తవ్వి రవాణా చేస్తున్నారు. ఇవేమీ అధికారులకు కనిపించకపోవడం వెనుక పలు అనుమానాలకు దారి తీస్తోంది. భారీ వాహనాలలో మట్టిని తరలిస్తుండటంతో కొత్తూరు నుంచి సాయిబాబా గుడి ముందుగా సత్తుపల్లి వైపు తారు రోడ్ శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికే భారీ మట్టి వాహనాలు తిరిగి సాయిబాబా గుడి వద్ద గుంతలు ఏర్పడటంతో మట్టి పోశారు. అక్కడే మంచి నీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా రోడ్డుపైకి నీరు చేరి అంతా బురదమయంగా మారి తారురోడ్డు మట్టిను తలపిస్తుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి అక్రమ వ్యాపారులకు అండగా ఎవరు ఉన్నారనేది సత్తుపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది. తెరవెనుక జరుగుతున్న సెటిల్‌మెంట్లు, రాజకీయ ఒత్తిడుల కారణంగానే మట్టి మాఫియా రోజురోజుకు రెచ్చిపోతుందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

వద్దిరాజుకు పువ్వాడ శుభాకాంక్షలు



ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి21: రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు పెద్దలసభకు వెళ్లటం ఎంతో సంతోషంగా ఉందని పువ్వాడ పేర్కొన్నారు.

సత్తుపల్లిలో మలై ఆపిల్



సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21: ఎండలు ఎక్కువగా ఉండే సత్తుపల్లిలో 35డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా మలై ఆపిల్ చెట్టుకు పండ్లు విరగకాశాయి. పట్టణంలోని స్వచ్ఛంద సేవకురాలు కొనకళ్ల సుధారాణి అరుదైన పండ్ల మొక్కలతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే మొక్కల పెంపకాన్ని చేపడుతుంటారు. ఈ క్రమంలో కడియం నుంచి తీసుకున్న ఆపిల్‌లో ఒకరమైన మలై ఆపిల్ మొక్కను పెంచుతున్నారు.

డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఏన్కూరు, ఫిబ్రవరి21: తిమ్మరావుపేట డబుల్ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఆరెం రామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కే.రామకృష్ణ పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యతే ధ్యేయం

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి21: విప్లవ పార్టీల ఐక్యతే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, కేపీ రామచందర్ పేర్కొన్నారు. బుధవారం పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారక భవనంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

సత్తుపల్లి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి
» కళాశాల అభివృద్ధి రూ.లక్ష విరాళం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21: సత్తుపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో శక్తివంచన లేకుండా శ్రమిస్తానని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని బాలికల జూనియర్ కళాశాలలో కాలేజీడేలో పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధి రూ.లక్ష విరాళం అందజేశారు. ప్రధాన సమస్యలైన విద్యావైద్యంపై ప్రత్యేక దృష్టికి సారించామని, మహిళలపై తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.బుధవారం సాయంత్రం సత్తుపల్లి కోర్టు భవనాల సముదాయాలను ఆమె పరిశీలించారు. కోర్టు భవనాలు, న్యాయవాదులు, ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. అన్నివర్గాల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు.


కోర్టు భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

పెనుబల్లి:విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం రాత్రి అడవిమల్లెల గురుకుల కళాశాలలో వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఆట పాటలతో ఉన్నతమైన చదువులతో జిల్లాలోనే ప్రథమంగా నిలుస్తున్న బాలికలు, అధ్యాపకులను అభినందించారు. రీజనల్ కోఆర్డినేటర్ ప్రత్యూష మాట్లాడుతూ మూడు జిల్లాల స్థాయిలో అడవిమల్లెల కళాశాల చదువు, క్రీడల్లోనూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మీ, వైస్‌ప్రిన్సిపాల్ జ్యోతి, ఎంపీటీసీ బెల్లంకొండ హైమావతి, ఎన్నారై ట్రస్టు డైరెక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు మందడపు అశోక్‌కుమార్, కోటేశ్వరరావు విద్యార్థినులు పాల్గొన్నారు. కాగా మండలంలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లకు రూ.21లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ చిత్రపటానికి మాజీ సర్పంచ్ షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. రూ.21లక్షలు మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నట్ల కుమారి, భద్రారెడ్డి, కృష్ణకుమారి, జానీ, రఫీ, జగన్, సుబ్బారావు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన దొండపాటి

మధిరటౌన్, ఫిబ్రవరి21: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను డీసీసీబీ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారి భట్టిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.



సదరం దరఖాస్తుకు నగదు డిమాండ్

పెనుబల్లి, ఫిబ్రవరి21: దివ్యాంగులు వికలాంగత్వాన్ని పరీక్షించుకునేందుకు నిర్వహిస్తున్న సదరం క్యాంపుకు దరఖాస్తు చేసుకొనేందుకు మీసేవ నిర్వాహకులు రూ.ఐదువేల వరకు డిమాండ్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సదరం క్యాంపుకు వెళ్లేందుకు ఈనెల 23న ఒక్కరోజే స్లాట్ బుక్ చేసుకొనే అవకాశముంది. ఆస్లాట్ బుక్ చేసుకుంటేనే సదరం క్యాంపుకు హాజరయ్యే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని మీసేవ నిర్వాహకులు కొందరు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

రోడ్డుపైన అయ్యప్పస్వామి విగ్రహం లభ్యం

వైరా, ఫిబ్రవరి21: వైరా-నెమలి రూట్లో బుధవారం గరికపాడు గ్రామ సమీపంలో ఒక కల్వర్టు మోరీపై అయ్యప్పస్వామి విగ్రహం లభ్యమైంది. ఈ విగ్రహాన్ని ఎవరైనా మర్చిపోయారా లేక ఎక్కడైనా అపహరించుకొని వచ్చి వదిలి వెళ్లారా అనే అంశమై అనుమానాలు విన్పిస్తున్నాయి. అరఅడుగు ఎత్తుతో ఇత్తడి లోహంతో తయారుచేసి ఉంది. ఈ విగ్రహాన్ని దాచాపురం గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి భక్తుడు శీలం కృష్ణారెడ్డి తన ఇంటికి తీసుకువెళ్లి భద్రపరిచారు.

